క్లుప్తంగా

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం నిర్లక్ష్యం



రైతుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : రైతులు మార్కెట్ యార్డుకు ధాన్యాన్ని తీసుకొచ్చి నెలలు గడుస్తున్నా ప్రభుత్వం కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తుందని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బీఎల్ఆర్ అన్నారు. మంగళవారం మండలంలోని అవంతీపురం మార్కెట్‌యార్డులో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు రాస్తారోకో చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆయన వారికి మద్దతు తెలిపి మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. మార్కెట్‌యార్డులో కనీసం గోనె సంచులు, టార్పాలిన్లు లేవన్నారు. అధికార పార్టీ నాయకులు అనుకూలమైన వారికే కాంటాలు వేస్తున్నారని అన్నారు. రైతు రాజు అని చెప్పుకుంటున్న ప్రభుత్వం కనీసం ధాన్యం కొనుగోలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. రైతులు ధాన్యాన్ని వెంటనే కాంటాలు వేసి తరలించాలని లేకుంటే ఎమ్మెల్యేల, మంత్రుల కాన్వాయ్‌లను అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ధనావత్ సిద్దునాయక్, మహేందర్‌రెడ్డి, జానినాయక్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశాన్ని బహిష్కరించిన కౌన్సిలర్లు

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశాన్ని పలువురు కౌన్సిలర్లు బహిష్కరించారు. పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడం లేదని ఆరోపిస్తూ బహిష్కరించినట్లు వారు తెలిపారు. వార్డుల్లో తాగునీరు, డ్రెయినేజీల సమస్యలున్నాయని వాటికి నిధులు కేటాయించడం లేదని కౌన్సిలర్ రమేశ్‌జీ, మంగ్తానాయక్ ఆరోపించారు.

సీఎం కప్ క్రీడలను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటేశ్వర్లు

గుర్రంపోడు : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఈనెల 15,16,17 తేదీల్లో జరిగే సీఎం కప్ క్రీడలను విజయవంతం చేయాలని ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మంచికంటి వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 15నుంచి 36 సంవత్సరాలలోపు విద్యార్థులు క్రీడల్లో పాల్గొనేందుకు తమ పేర్లను పాఠశాలలో నమోదు చేసుకోవాలన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్ క్రీడలు ఉంటాయని అన్నారు. సీఎం కప్ క్రీడలకు చైర్మన్‌గా ఎంపీపీ, కన్వీనర్‌గా ఎంపీడీఓ, సభ్యులుగా జెడ్పీటీసీ, తహసీల్దార్, ఎస్‌ఐ ఉంటారని అన్నారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీపాద సుధాకర్, ఎంపీఓ దుర్గాప్రసాద్, సర్పంచ్‌లు చాడ చక్రవర్తి, పద్మా వెంకటేశ్వర్లు, పోలె రాములమ్మ రామచంద్రం పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన సదస్సు



చింతపల్లి : సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ విశాలాక్షి

చింతపల్లి : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండల ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి శ్రీదేవి, తహసీల్దార్ విశాలాక్షి మాట్లాడుతూ.. గుండెపోటు, ప్రాణాపాయ సమయాల్లో సీపీఆర్ చేయడంతో ప్రాణాలు కాపాడవచ్చన్నారు. ఎమర్జెన్సీ సమయంలో సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజు, ఐసీడీఎస్, పంచాయతీరాజ్, రెవెన్యూ, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దవూర : మండల కేంద్రంలో మండల వైద్యాధికారి నగేష్ ఆధ్వర్యంలో కార్డియో పల్మోనరీ రిససిటేషన్ (సీపీఆర్)పై ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనిషి గుండె అకస్మాత్తుగా ఆగిపోతే వారికి సీపీఆర్ చేయడం ద్వారా బతికించే అవకాశం ఉంటుందని సీపీఆర్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురిగి సైదులుగౌడ్, ఎంపీడీఓ కూన్‌రెడ్డి విజయాకుమారి, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



పెద్దవూరలో సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నగేష్

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ విద్యార్థుల ప్రతిభ

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్(సీఎస్) ద్వితీయ సంవత్సరం చదువుతున్న పగిడిమర్రి శ్వేత మంగళవారం ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో (956) మార్కులు సాధించి ప్రతిభకనబరిచింది. శ్వేతను ప్రిన్సిపల్ ధన్‌రాజు, అధ్యాపకులు ప్రవీణ్‌కుమార్, సాల్మా, మధుసూదన్ అభినందించారు.

కేఎల్ఎన్ కళాశాల విద్యార్థి ప్రతిభ..

మిర్యాలగూడ : పట్టణంలోని కేఎల్ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు మంగళవారం వెలువరించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో సత్తా చాటారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో సీహెచ్.పవన్‌కుమార్ (467) మార్కులు సాధించాడు. అదేవిధంగా బైపీసీలో సంజన(432), ద్వితీయ సంవత్సరంలో ఎం.శ్రీజ ఎంపీసీలో (991) సాధించింది.

నిడమనూరు ఆదర్శ విద్యార్థులు..

నిడమనూరు : మండలంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు మంగళవారం ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రతిభచూపారు. పాఠశాలకు చెందిన కొప్పెర రమ్య ఇంటర్ సెంకడ్‌ఇయర్ (బైపీసీ)లో 960మార్కులు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రంజిత తెలిపారు. అదేవిధంగా గాదె అంజలి (940), వై.మనూష (939), కే.ఇందు (938), సీరుటి శిరీష (930), బెజవాడ రమ్యశ్రీ 918 మార్కుల సాధించారు. ఎంపీసీ విభాగంలో యాతం యామిని (932), కాట్నం శ్రీవల్లి (931), పావని (928), శివ (915), ఎంఈసీ విభాగంలో అఖిల (887), పల్లవి (854) మార్కులను సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ రంజిత, అధ్యాపకులు అభినందించారు.

హాలియా కేజీబీవీ విద్యార్థుల సత్తా..

హాలియా : పట్టణంలో కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో బి.సంధ్య 877మార్కులు, బైపీసీ విభాగంలో బి.సునీత 866, ప్రథమ సంవత్సరం ఎంపీసీలో పూజిత 379, బైపీసీలో స్వాతి 368 మార్కులు సాధించినట్లు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ హైమావతి తెలిపారు.

చింతపల్లి మోడల్‌స్కూల్ విద్యార్థులు..

చింతపల్లి : మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్ విద్యార్థులు మంగళవారం వెలువడిన ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటారు. మొదటి సంవత్సరంలో 88.46శాతం ఉత్తీర్ణత సాధించగా ద్వితీయ సంవత్సరంలో 94.25శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీలో వీరమళ్ల శివాణి 395, జర్పుల ప్రవళిక 395, బైపీసీలో జర్పుల రాజేశ్వరి 368, జబ్బు శిల్ప 357, సీఈసీలో మస్కు మానిక 376, ద్వితీయ సంవత్సరానికి గాను ఎంపీసీలో దాసరి కీర్తి 968, హనుమంతుల స్వాతి 948, బైపీసీ విభాగంలో విజయలక్ష్మి 961, పోలె వెంకటేశ్ 776, నేనావత్ దీపక్ 774 మార్కులు సాధించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.



మిర్యాలగూడ : పవన్‌కుమార్‌ను అభినందిస్తున్న కేఎల్ఎన్ కళాశాల యాజమాన్యం



మిర్యాలగూడ టౌన్ : శ్వేతకు స్వీట్లు తినిపిస్తున్న తల్లిదండ్రులు



రమ్య, బైపీసీ(960), మోడల్‌స్కూల్ నిడమనూరు



యాతం యామిని, ఎంపీసీ(932) మోడల్ స్కూల్ నిడమనూరు



పి.వంశీ, బైపీసీ(977) గురుకుల విద్యాలయం నాగార్జునసాగర్



అజయ్, ఎంపీసీ(985) గురుకుల విద్యాలయం నాగార్జునసాగర్

నాగార్జునసాగర్ గురుకుల విద్యాలయం..

నాగార్జునసాగర్ : ఇంటర్‌బోర్డు విడుదల చేసిన ఫలితాల్లో స్థానిక మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల కళాశాలలోని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ఎం.అజయ్ 985 (తిప్పర్తి మండలం తిమ్మలమ్మగూడెం) మార్కులతో రాష్ట్రంలో 10వర్యాంకు సాధించాడు. బైపీసీలో పి.వంశీ 977 (నర్సింహులగూడెం), ఎంఈసీలో ఎం.ఆశిష్ 967 (వద్దిపట్ల పీఏపల్లి మండలం), సీఈసీలో ఎం.మహేష్ 956 (వెల్దండ, గరిడెపల్లి మండలం) సాధించినట్లు ప్రిన్సిపాల్ రజనీకాంత్ తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో రేవంత్ 460, బైపీసీలో రాంబాబు 408, ఎంఈసీలో జి.నవీన్‌గౌడ్ 443, సీఈసీలో అన్వేష్‌కు 459 మార్కులు సాధించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులు ద్వితీయ సంవత్సరంలో 75శాతం ఉత్తీర్ణత సాధించగా మొదటి సంవత్సరంలో 69శాతం ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపల్ ధారా పాండయ్య తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో ప్రణయ్‌రెడ్డి ఎంపీసీలో 935, బైపీసీలో మేకల గాయత్రి 920మార్కులు సాధించినట్లు తెలిపారు.

డిండిలో 98శాతం ఉత్తీర్ణత..

డిండి : ఇంటర్ బోర్డు మంగళవారం వెలువరించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలోని విద్యార్థులు 98.7శాతం, స్థానిక ఆదర్శ పాఠశాలలోని విద్యార్థులు 84.06శాతం ఉత్తీర్ణత సాధించారు. సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో వి.వైష్ణవి 980మార్కులు, పి.అఖిల 973మార్కులు, బైపీసీలో ఎం.భానుమతి 966మార్కులు, వి.శృతి 960మార్కులు, ఆదర్శ పాఠశాలలో ఎంపీసీలో కే. శివప్రసాద్ 983 మార్కులు, కె.ప్రశాంత్ 955మార్కులు సాధించారు.



వి.వైష్ణవి ఎంపీసీ (980) సాంఘిక సంక్షేమ గురుకుల, డిండి



కే.శివప్రసాద్, ఎంపీసీ (983) మోడల్‌స్కూల్ డిండి

విద్యార్థికి రాష్ట్ర స్థాయి రెండో ర్యాంకు

పెద్దవూర: మండల కేంద్రానికి చెందిన నిరుపేద ముస్లిం విద్యార్థి తౌఫిక్ నజీం మంగళవారం ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రథమ సంవత్సరంలో 467 మార్కులు సాధించి రాష్ట్రంలో రెండో ర్యాంకును సాధించాడు. ర్యాంకు సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, మండల కేంద్రానికి చెందిన ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

కొండమల్లేపల్లిలో ప్రతిభ చాటిన విద్యార్థులు

కొండమల్లేపల్లి : ఇంటర్ ఫలితాల్లో మంగళవారం మండలంలోని ఆయా కళాశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటారు. ఎస్టీ గురుకుల కళాశాలకు చెందిన ఎం.శ్వేత ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 979, బి.సంధ్య 972, ప్రథమ సంవత్సరానికి గాను బి.వాణి 455, ఈ.సరిత 454, అలాగే ఎస్సీ గురుకుల కళాశాలకు చెందిన డి.నిఖిత 941, ఆర్.శిరీష 919 సాధించారు. మైనార్టీ గురుకుల పాఠశాలలో బైపీసీ ద్వితీయ సంవత్సరంలో బి.మణికుమార్ 955, అఫ్రోజ్ 955, ఎంపీసీ విభాగంలో కె.ఆనంద్ 925, ఎంపీసీ మొదటి సంవత్సరంలో పి.చంద్రప్రకాశ్ 462, బైపీసీలో ఎండీ.రిజ్వాన్ 407మార్కులు సాధించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఆయా కళాశాలల అధ్యాపకులు అభినందించారు.

ఇంటర్మీడియట్ ఫలితాల్లో దేవరకొండ విద్యార్థుల ప్రతిభ



హనుమంతు, ఎంపీసీ (982) కొమ్మేపల్లి ట్రైబల్ వెల్ఫేర్ కళాశాల

దేవరకొండ : ఇంటర్ బోర్డు మంగళవారం వెలువరించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో పట్టణంలోని ఎస్టీ గురుకుల బాలికల కళాశాలకు చెందిన శిరీష బైపీసీలో సెకండ్ ఇయర్‌లో 988, ఎంపీసీలో వసంత 973 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఉమా సుజాత తెలిపారు. మోడల్ కళాశాలకు చెందిన అనిల్ ఎంపీసీ విభాగంలో 962, బైపీసీలో శివకుమార్ 982మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సువర్ణ తెలిపారు. దేవరకొండ ప్రభుత్వ బాలుర కళాశాలకు చెందిన విద్యార్థి అజయ్‌రెడ్డి ద్వితీయ సంవత్సరానికి గాను ఎంపీసీలో 947, తేజ్‌కుమార్ 937మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ మల్లయ్య తెలిపారు. మండల పరిధిలోని కొమ్మేపల్లి ట్రైబల్ వెల్ఫేర్ బాలుర జూనియర్ కళాశాలకు చెందిన హనుమంతు ఎంపీసీలో 982, సుధీర్ బైపీసీలో 970మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ రఘుపతి తెలిపారు.

గుర్రంపోడు మోడల్‌స్కూల్ విద్యార్థుల ప్రతిభ



మెగావత్ రాజేశ్వరీ, ఎంపీసీ (955)

గుర్రంపోడు : మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ అపర్ణ మంగళవారం తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో మోగావత్ రాజేశ్వరి 955, పిల్లి రాధిక 908, జెల్లా భవాని 906, బైపీసీలో మానిక 929, మెగావత్ మానిక 925, ప్రవల్లిక 901 మార్కులు, సీఈసీలో నాగరాజు, 753, ఎంఈసీలో గణేష్ 844 మార్కులు సాధించారు.

రాజ్యాంగ పుస్తకాలను పంపిణీ చేయాలని వినతి



ఆర్ఐ సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్ : భారత రాజ్యాంగ పుస్తకాలను పంపిణీ చేయాలని కోరుతూ మండల తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ సత్యనారాయణకు ధర్మసమాజ్ పార్టీ (డీఎస్‌పీ) ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకుడు ఎల్లయ్య మాట్లాడుతూ.. ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ విశారధన్ మహారాజ్ ఆదేశాల మేరకు తెలంగాణలోని ప్రతి పౌరుడికి భారత రాజ్యాంగ పుస్తకాన్ని పంపిణీ చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజశేఖర్, కళ్యాణ్, శంకర్, హరికృష్ణ, సైదులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు తదితరులున్నారు.

ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి జరిమానా

నిడమనూరు : ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి నిడమనూరు జూనియర్ సివిల్ కోర్టు మంగళవారం రూ.3వేల జరిమానా విధిస్తూ తీర్పువెల్లడించింది. లైజన్ ఆఫీసర్ అలీ అమ్మద్ తెలిపిన వివరాల ప్రకారం.. 2016 మార్చి 28న పెద్దవూర మండలం పోతునూరుకు చెందిన రెడ్డి సైదయ్య అదే గ్రామానికి చెందిన బానాల సురేష్‌ను తోడుగా వెంటతీసుకుని బైక్‌పై మల్లేపల్లికి బయలుదేరారు. ఈ క్రమంలో రెడ్డి సైదయ్య బైక్ నడుపుతుండగా ప్రమాదవశాత్తు కిందపడింది. ఈ సంఘటనలో బైక్‌పై వెనుక కూర్చున్న బానాల సతీష్‌కు తీవ్రగాయాలుకాగా అతడిని వెంటనే హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ సురేష్ చికిత్స పొందుతూ మరుసటి రోజు మృతి చెందాడు. దీంతో మృతుడు సురేష్ తండ్రి బానాల నాగేశ్వరరావు సైదయ్యపై ఫిర్యాదు చేయడంతో అప్పటి పెద్దవూర ఎస్ఐ బి.ప్రసాద్ కేసు నమోదు చేశారు. మంగళవారం నిడమనూరు జూనియర్ సివిల్ కోర్టులో కేసు విచారణకు రావడంతో సైదయ్య అజాగ్రత్త కారణంగానే బైక్ ప్రమాదం జరిగి సురేష్ మృతి చెందాడని జడ్జి నిర్ధారించి సైదయ్యకు రూ.3వేల జరిమానా, చెల్లించకపోతే నెల రోజుల జైలు శిక్ష విధిస్తూ జడ్జి టి.స్వప్న తీర్పును వెల్లడించినట్లు ఆయన తెలిపారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ : కంటి వెలుగు పథకాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని మర్రిచెట్టుతండా గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆయా గ్రామాల్లో నిర్వహించే కంటి వైద్యశిబిరాలలో వైద్యసిబ్బంది ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి కళ్ల జోళ్లను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టి పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు ఆయన గుర్తుచేశారు. కంటి వెలుగును ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మారుపాకల అరుణసురేష్‌గౌడ్, వైస్‌ఎంపీపీ చింతపల్లి సుభాష్, ఎంపీడీఓ శర్మ, ఎంపీటీసీ కొర్ర గౌతమిరాంసింగ్, సర్పంచ్ శ్రీను నాయక్, బొడ్డుపల్లి కృష్ణ, గ్రామస్తులు ఉన్నారు.

హాలియా : కంటి వెలుగును ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆప్కాబ్ రాష్ట్ర మాజీ చైర్మన్ యడవెల్లి విజయేందర్‌రెడ్డి, హాలియా మున్సిపల్ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మశంకరయ్య అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని మొదటి వార్డులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. అంధులు లేని తెలంగాణ రాష్ట్రంగా నిర్మించేందుకు సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అనంతరం కంటి వెలుగు కార్యక్రమంలో పాల్గొన్న రోగులకు వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నల్లబోతు వెంకటయ్య, ప్రసాద్‌నాయక్, కోఆప్షన్ సభ్యుడు చాపల సైదులు, నాయకులు అక్బర్‌ఖాన్, యాకోబు, ఆంజాద్‌ఖాన్, సంపత్, పుల్లయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ నల్లబోతు వెంకటయ్య, చాపల వెంకన్న, శ్రీరాములు, శ్రీను, పిట్టల శ్రీను, అయ్యూబ్ ఖాన్, డాక్టర్ రామకృష్ణ, సిబ్బంది మోతీలాల్, దయాసాగర్, ఏఎన్‌ఎం పూలకళ, యాసిన్, కుషిత్ తదితరులు ఉన్నారు.



దేవరకొండ : వృద్ధులకు కళ్లద్దాలు తొడుగుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాయక్, తదితరులు



హాలియా : కంటి పరీక్షలు చేయించుకుంటున్న ఆప్కాబ్ మాజీ చైర్మన్ విజయేందర్‌రెడ్డి

కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరం

మాడుగుపల్లి : మండలంలోని ఇందుగుల గ్రామంలో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరం మంగళవారం కొనసాగింది. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ శిబిరం వద్దకు రాలేని స్థితిలో ఉన్న వయోవృద్ధుల ఇంటికి వెళ్లి వైద్యసిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఫిర్దోజ్ ఫర్కంద, షేక్ ఖలీమ్, సీహెచ్‌ఓ సోమయ్య, డీఈఓ అరుణ, ఏఎన్‌ఎంలు భవానీ, సునీత, సవిత, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి ఎమ్మెల్యేల వివరాలు బహిరంగ పర్చాలి



దేవరకొండ : అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

దేవరకొండ : దళిత బంధులో అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేల వివరాలు బహిరంగ పర్చాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోతెం సహదేవుడు అన్నారు. మంగళవారం పట్టణంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రం సమర్పించారు. ఇప్పటికైనా లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేసిన వారి వివరాలు బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంకూరి నాగరాజు, యేసు, నగేష్, శ్రీ ను, ఆంజనేయులు, నగేష్, తదితరులున్నారు.

మిర్యాలగూడ : దళిత బంధులో అక్రమాలకు పాల్పడిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించి పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మచ్చ ఏడుకొండలు మాదిగ అన్నారు. మంగళవారం దామరచర్ల మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహ వద్ద చేపట్టిన దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. దళిత బంధు పథకంలో డబ్బులు తీసుకున్న ఎమ్మెల్యేలు తిరిగి లబ్ధిదారులకు డబ్బులు తిరిగి ఇవ్వాలని, సదరు ఎమ్మెల్యేలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి అనర్హులుగా ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో సంద్ర నాగరాజు, సందాల శంభయ్య, సయ్యద్ ఫరూక్, ప్రసాద్, గోపాల్, శ్రీను, జీడయ్య యాదవ్, నాగు తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడ : సమావేశంలో మాట్లాడుతున్న ఏడుకొండలు

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే నోముల భగత్

పెద్దవూర : దేశంలో ఎక్కడా లేనివిధంగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పలు అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి దేశం యావత్తు తెలంగాణ వైపు చూసేలా చేస్తున్నారని ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండలానికి చెందిన 50 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, జెడ్పీ వైస్‌చైర్మన్ ఇరిగి పెద్దులు, ఏఎంసీ చైర్మన్ జవాజీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ సురిగి సైదులుగౌడ్, ఏఎస్ఓ రావుల సాలయ్య, నాయకులు గజ్జెల లింగారెడ్డి, కర్ణ బ్రహ్మారెడ్డి, కర్నాటి మునిరెడ్డి, రామలింగయ్య, బషీర్, నరేందర్‌రెడ్డి, బాలయ్య, రాజేష్, పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

సమస్యలు పరిష్కరించాలని మండల వీఓఏలు మంగళవారం ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వీఓఏల సంఘం జిల్లా అధ్యక్షుడు చిలుముల దుర్గయ్య మాట్లాడుతూ.. 23రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ, సమస్యలను పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వీఓఏలు పాతనబోయిన పద్మ, పాల్తీ శంకర్, తరి మంజుల, చెన్ను రజిత, రాజేశ్వరి, సుహాసిని, బికోజీ, సత్యనారాయణ, భాగ్య, మానిక, సరోజ పాల్గొన్నారు.



పెద్దవూర : కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులతో లబ్ధిదారులు, ఎమ్మెల్యే భగత్, తదితరులు

సైదులు మృతికి నివాళి

హాలియా : మునిపాలిటీ పరిధిలోని 9వ వార్డుకు చెందిన పారిశుద్ధ్య కార్మికుడు ఏలేటి సైదులు మంగళవారం అకాల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నోముల భగత్, జెడ్పీ వైస్‌చైర్మన్ ఇరిగి పెద్దులు మృతుడి నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా మున్సిపల్ కౌన్సిల్ ఫోరం జిల్లా అధ్యక్షుడు వర్ర వెంకట్‌రెడ్డి సైదులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జవ్వాజి వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చెరుపల్లి ముత్యాలు, కౌన్సిలర్ ప్రసాద్ నాయక్, మార్కెట్ డైరెక్టర్ సురభి రాంబాబు, నాయకులు జింకల ప్రసాద్, నద్ది బాలరాజుయాదవ్, రాంబాబు, శేఖర్ ఉన్నారు.



నిడమనూరులో చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే భగత్

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నిడమనూరు : ప్రభుత్వం ప్రవేశపెట్టిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో పేద కుటుంబాలపై ఆర్థికభారం తగ్గిందని ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రమీళ, ఎంపీపీ జయమ్మ, డీసీసీబీ డైరెక్టర్ అంజయ్య, జెడ్పీటీసీ నందికొండ రామేశ్వరి, మార్కెట్ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, బైరెడ్డి సత్యనారాయణరెడ్డి, యాదయ్య, బొల్లం రవి, మధు, శంకర్, సత్యనారాయణరెడ్డి, దేవస్థానం చైర్మన్ మేరెడ్డి వెంకటరమణ, రామలింగయ్య తదితరులు ఉన్నారు.

గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కృషి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

కొండమల్లేపల్లి : గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. మన ఊరు– మన ప్రభుత్వం – మన పథకాలు కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుమ్మడవెల్లి, దేవరోనితండాలలో రూ.62.60లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి తన శక్తి మేర కృషి చేస్తున్నట్లు తెలిపారు. పోడు భూముల సమస్యలు పరిష్కరించి, పట్టాలు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా గుమ్మడవెల్లి ప్రజలు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరందించాలని కోరారు. దేవరోనితండా వాసులు తమ తండాలో హైవోల్టేజీ విద్యుత్ సమస్య ఉందని, నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, పెన్షన్ రెండు నెలలకు ఒకసారి ఇస్తున్నారని ఎమ్మెల్యేకు వినవించారు. దీంతో త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీపీ దూదిపాల రేఖారెడ్డి, ఎంపీడీఓ బాలరాజురెడ్డి, సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌గౌడ్, గుమ్మడవెల్లి సర్పంచ్ లింగంయాదవ్, వైస్‌ఎంపీపీ వెంకటేశ్వర్లు, రైతు బంధు అధ్యక్షుడు కేసాని లింగారెడ్డి, నాయకులు రమావత్ తులసిరాం, పంగా లాలయ్య, బోడ యాదయ్య, ఇస్లావత్ గోవింద్, రమావత్ భీమ్‌సింగ్, రాములు, కృష్ణ, జహంగీర్, ఇస్మాయిల్, శంకర్‌నాయక్, హరికృష్ణ, వెంకటేశ్, శ్రీను, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ర్యాలీని విజయవంతం చేయాలి

దేవరకొండ : పట్టణంలో ఈనెల 14న శ్రీహనుమాన్ జన్మదినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న హనుమాన్ మహార్యాలీని విజయవంతం చేయాలని హనుమాన్ శక్తి జాగరణ సమితి సభ్యులు కోరారు. మంగళవారం పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో హనుమాన్ శక్తి జాగరణ సమితి అధ్యక్షుడు నీలా రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. ర్యాలీకి పెద్ద ఎత్తున హిందువులు తరలి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం ర్యాలీకి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు పంగునూరి లింగయ్య, వెంకటేష్, జగదీష్, వినయ్, నాగేశ్వర్‌రావు, ఇందిర ఉన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సభ్యులు

పీఆర్‌టీయూ టీఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శుల నియామకం



కేశబోయిన గోపాల్, అధ్యక్షుడు



పాదిల యాదగిరి, ప్రధాన కార్యదర్శి

గుర్రంపోడు : పీఆర్‌టీయూ తెలంగాణ మండల శాఖ అధ్యక్షుడిగా కేశబోయిన గోపాల్, ప్రధాన కార్యదర్శిగా పాదిల యాదగిరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మారం అంజిరెడ్డి సమక్షంలో జరిగిన ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

త్రిపురారం : మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కలకొండ మల్లయ్య పెద్ద కుమారుడు కలకొండ రవి(30) మంగళవారం గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి బొర్రాయిపాలెంలో రవి మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట స్థానిక సర్పంచ్ వెంకటయ్య సైదయ్య, రాజేంద్రనగర్ సర్పంచ్ గుండ్లపల్లి సునీత వెంకట్‌రెడ్డి, వెంకన్న ఉన్నారు.